26 నుంచి శిక్షణ తరగతులు

నాంపల్లి: ఈనెల 26 నుంచి జూన్ 14 వరకు బీఎఫ్ఏ శిల్పం, చిత్రలేఖనంపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కె.హనుమంతరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్సిటీలోని శిల్పం, చిత్రలేఖనం, ప్రింట్ మేకింగ్ అధ్యాపకుల ద్వారా శిక్షణ 3 వారాల పాటు ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 8309011865, 8309498807 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సమస్యలు తెలుసుకునేందుకే 'బస్తీ బాట'



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే 'బస్తీబాట' చేపడుతున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్న ఆయనను వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు బుధవారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో రూ.292 కోట్లతో అధునాతన డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, అబిన్ చౌస్ తదితరులున్నారు.

23, 24న ఉచిత మెగా వైద్య శిబిరం

అఫ్జల్‌గంజ్: సత్య సుందర్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23, 24 న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గోపాల్ సింగ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మెడిసిటీ ఆసుపత్రి సహకారంతో ధూల్‌పేట రహీంపురా అంబేడ్కర్ భవన్‌లో శిబిరాన్ని ఉంటుందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని పేర్కొన్నారు. జనరల్ హాస్పిటల్స్ ఈ.ఎన్.టీ, చిన్నపిల్లల వైద్యులు, ఆప్తామాలజిస్టు, గైనకాలజిస్టులు అందుబాటులో ఉంటారని తెలిపారు. రక్త, షుగర్, గుండె, ఊపిరితిత్తుల్లాంటి పరీక్షలను ఉచితంగా చేస్తారని పరిసర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నిర్మల్‌కుమార్ యాదవ్

అబిడ్స్: గాంధీభవన్‌లో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్, గోషామహల్ కాంగ్రెస్ నాయకులు శ్యామ్‌సింగ్, గోకరణ్ సింగ్, బద్రినాథ్, సుభాష్, కిషన్, బబ్లు తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. దేశంలో సాంకేతిక విప్లవం తీసుకువచ్చిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకు దక్కుతుందన్నారు.

వధశాలకు వెళ్లకుండా అడ్డుకుని.. గోశాలకు తరలించి



పట్టుకున్న ఆవులు, నిందితులతో పోలీసులు

జియాగూడ: చౌటుప్పల్ ప్రాంతం నుంచి లారీలో వధశాలకు తీసుకెళ్తున్న 28 గోవులను పట్టుకుని జియాగూడ సమర్థ గోశాలకు తరలించారు. అరటిపండ్ల లోడ్‌తో వెళ్తున్న లారీలో గోవులు ఉన్నట్లు సమాచారం మేరకు గో రక్షా దళ్ టైగర్ ఫోర్స్ సభ్యులు పట్టుకుని అరటిగెలలను కిందకు దించగా గోవులు కనిపించాయన్నారు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చామని వారు తెలిపారు. అధ్యక్షుడు దీపక్ సింగ్, యుగ తులసీ ఫౌండేషన్ సభ్యులు శివకుమార్, గోగ్యాన్ ఫౌండేషన్ నితేశ్, విజయ్, రాకేశ్ సింగ్, శంకర్ సింగ్, కేదర్ సింగ్, వివేక్ సింగ్, కొత్వార్ విశాల్, ఏబీవీపీ ఠాకూర్ ఆయుష్ సింగ్, అభిషేక్ సింగ్ పాల్గొన్నారు.

నేడే రంగనాథుడి కల్యాణం



పెళ్లికొడుకుగా శ్రీ రంగనాథుడు



జియాగూడ: రంగనాథ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం ఆలయ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ప్రతినిధి శేషాచారి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం వసంతోత్సవాన్ని పురస్కరించుకుని 51 మంది మహిళలు పసుపు దంచి స్వామివారిని దేవేరులకు అభిషేకం చేసి పెళ్లికొడుకు, పెళ్లి కూతురును చేశారు. గురువారం సాయంత్రం 7 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం జరుగుతుందని భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే 23న రథోత్సవం, 24న చక్రస్నానం, 25న పుష్పయాగం వివిధ రకాల లక్ష పుష్పాలతో, 28న సహస్ర (1008) కళశాలతో మహా అభిషేకం తదితర కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.



వసంతోత్సవ వేడుకల్లో మహిళలు

రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయం



చాంద్రాయణగుట్ట: రక్తదానం చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని దక్షిణ మండలం డీసీపీ స్నేహామెహ్రా అన్నారు. ఛత్రినాక పోలీసుల ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం బుధవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా 150 మంది దాతలు రక్తదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తలసేమియా రోగులకు తరచూ రక్తం ఎక్కించాల్సి ఉంటుందని, సకాలంలో రక్తం అందకపోతే ప్రాణాలు సైతం కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఛత్రినాక పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేంద్ర ప్రసాద్ వర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఛత్రినాక డివిజన్ ఏసీపీ చంద్రశేఖర్, శాలిబండ ఇన్‌స్పెక్టర్ మహేశ్ గౌడ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన నాయకులు



నగర కమిషనర్ సి.వి.ఆనంద్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న దృశ్యం

గోల్కొండ: టోలిచౌకికి వచ్చిన నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్‌ను పలువురు మజ్లిస్ సీనియర్ నాయకులు బుధవారం కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. నగరాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు తాము తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల ఆటలను ఎప్పటికప్పుడు కనిపెట్టి అదుపులోకి తీసుకుంటున్నామన్నారు. అదేవిధంగా గంజాయి లాంటి మత్తు పదార్థాల సరఫరాకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశామన్నారు. కలిసిన వారిలో మజ్లిస్ సీనియర్ నాయకులు మహ్మద్ ముస్తాఫా, మిర్జా ఎక్బాల్ అహ్మద్, ఎంఏ బేగ్, కారీ మతీన్ ఆలీషా ఖాద్రీ తదితరులు ఉన్నారు.

ఫార్మసీ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి దామోదర రాజనర్సింహాకు వినతి పత్రం అందిస్తున్న ఫార్మసీ సంఘం నాయకులు

సుల్తాన్‌బజార్: ఫార్మసీ ఆఫీసర్స్ సమస్యలు పరిష్కరించి ఫార్మసీ చట్టాలు అమలు చేయాలని తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్ష , కార్యదర్శులు బత్తిని సుదర్శన్‌గౌడ్, జాలిగామ అశోక్ కోరారు. ఈ మేరకు తెలంగాణ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ.. బస్తీ, పల్లె దవాఖానాలు, ప్రతి జిల్లా, డీఎంహెచ్ఓ ఫార్మసీ స్టోర్లు, అలాగే మలేరియా, లెప్రసీ, టీబీ, స్టోర్లలో ఫార్మసీ ఆఫీసర్లను నియమించాలన్నారు. జిల్లా ఫార్మసీ ఆఫీసర్ల పోస్టులను అన్ని జిల్లాల్లోని టీచింగ్ ఆసుపత్రుల్లో భర్తీ చేయాలని కోరారు. సర్వీస్‌లో మూడు ప్రమోషన్లు ఇవ్వాలని, విద్యార్హతల ఆధారంగా డైటీషియన్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, డ్రగ్ అనాలసిస్ పోస్టుల్లోనూ ప్రాధాన్యత కల్పించాలని విన్నవించారు. రాష్ట్రస్థాయిలో ప్రత్యేక ఫార్మసీ డైరెక్టరేట్‌ను నియమించి అందులో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఫార్మసీ ఆఫీసర్, అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు క్రియేట్ చేయాలని డిమాండ్ చేశారు. ముగ్గురు ఫార్మసీ ఆఫీసర్స్ ఉన్న డీఎంఈ పరిధిలోని అన్ని ఆసుపత్రుల్లో ఒక సీనియర్ ఫార్మసీ ఆఫీసర్‌ను నియమించాలన్నారు. ఈ సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ భూమిలో సర్వే

చాంద్రాయణగుట్ట: బండ్లగూడ మండల పరిధి ఫలక్‌నుమా ఖాద్రీ చమాన్ సమీపంలోని పంచలింగాల ఆలయ భూమిలో అధికారులు బుధవారం సర్వే నిర్వహించారు. సర్వే నంబర్-6 లోని దేవాలయ భూమి కబ్జాకు గురైందని వానరసేనా ఫిర్యాదు మేరకు సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీరామ్, అడిషనల్ డిప్యూటీ కలెక్టర్ సునీత, బండ్లగూడ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, సర్వేయర్ శ్రీనాథ్ పోలీస్ బందోబస్తు నడుమ సర్వే నిర్వహించి మార్కింగ్ చేశారు.

రోలర్ స్కేటింగ్‌ను అభివృద్ధి చేయాలని వినతి

డబీర్‌పురా: హైదరాబాద్ నగరంలో రోలర్ స్కేటింగ్‌ను అభివృద్ధి చేయాలని తెలంగాణ రోలర్ స్కేటింగ్ తల్లిదండ్రుల సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలో రోలర్ స్కేటింగ్ కోసం అభివృద్ధి, సౌకర్యాలను కల్పించాలన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.



రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

ప్రజల సహకారంతోనే శాంతిభద్రతల పరిరక్షణ



సౌత్ వెస్ట్ జోన్ ఏసీపీలను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: శాంతిభద్రతలు కాపాడడంతో పాటు పండుగలు ప్రశాంతంగా జరుపుకునేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. పీస్ ఫోర్స్ కమిటీ అంబాసిటర్ మహ్మద్ నజీబ్ సౌత్ వెస్ట్ జోన్ ఏసీపీలను టోలిచౌకీ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించేందుకు టోలిచౌకీ పోలీస్‌స్టేషన్ కొత్తగా ఏర్పాటు అయిందన్నారు. కొత్తగా ఏర్పాటైన టోలిచౌకీ పోలీస్‌స్టేషన్‌కు కూడా పీస్ కమిటీ వేసే విషయం ప్రతిపాదనలో ఉందన్నారు. కార్యక్రమంలో ఏసీపీలు మహ్మద్ మునావర్, శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు వెంకటరాములు, మల్లేశ్, బి.సైదులు, ఎల్.రమేశ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

పనులు పూర్తి చేయాలని వినతి

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ పావని జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. ఈ మేరకు జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను బుధవారం కలసి సమస్యలను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. శానిటేషన్ పనులను మెరుగుపరచాలని అన్నారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరామన్నారు. జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి పెండింగ్ పనులను పూర్తి చేసేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారి అరెస్ట్

చాంద్రాయణగుట్ట: పేదల నుంచి పెద్ద మొత్తంలో వడ్డీలు వసూలు చేస్తున్న ఓ వ్యాపారిని ఫలక్‌నుమా పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫారూక్‌నగర్‌కు చెందిన సయ్యద్ చాంద్ పాషా (47) టైలర్‌గా పని చేస్తున్నాడు. స్థానికంగా డబ్బులు అవసరమైన నిరుపేదలకు 20 శాతం వరకు వడ్డీలు ఇస్తున్నాడు. సమయానికి ఇవ్వని వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్, ఫలక్‌నుమా పోలీసులు దాడులు చేసి అతడిని అరెస్ట్ చేసి రూ.40 వేలు, నోట్‌బుక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

తల్లిదండ్రులపై దాడి చేసిన కుమారుడిపై కేసు

అబిడ్స్: తల్లిదండ్రులపై దాడికి పాల్పడిన కుమారుడిపై కేసు నమోదైన ఘటన గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ బి.రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మెహిదీపట్నంలోని పద్మనాభానగర్‌లో ఉంటున్న విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి జేఆర్.లక్ష్మీనారాయణ,ఆయన భార్యను వారి కుమారుడు చంద్రశేఖర్ కొంత కాలంగా మానసికంగా హింసించడంతో పాటు శారీరకంగా వేధిస్తున్నాడు. ఇటీవల ఆస్తికి సంబంధించిన లావాదేవీలపై భౌతిక దాడికి పాల్పడ్డాడు. దీంతో తల్లి అనురాధా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేపు 'హరే శ్రీనివాస' గ్రంథావిష్కరణ

నాంపల్లి: టీటీడీ మాజీ కార్యనిర్వాహక అధికారి, విశ్రాంత ఐఏఎస్ డాక్టర్ కె.వి.రమణాచారి రచించిన అసాధ్యాలను సుసాధ్యాలు చేసిన అద్భుత సత్యాల హారం 'హరే శ్రీనివాస' గ్రంథావిష్కరణ సభ ఈనెల 23న పబ్లిక్‌గార్డెన్స్ ప్రాంగణంలోని తెలుగు వర్సిటీ నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరగనున్నది. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగే సభకు ముఖ్య అతిథిగా పుష్పగిరి పీఠాధిపతులు, జగద్గురువులు అభినవోద్దండ విద్యా శంకర భారతీ మహాస్వామి హాజరై ఆవిష్కరిస్తారని కిన్నెర ఆర్ట్ థియేటర్స్ కార్యదర్శి మద్దాళి రఘురాం తెలిపారు. దూరదర్శన్–ఢిల్లీ పూర్వ అదనపు డైరెక్టర్ జనరల్ అధ్యక్షతన జరిగే సభకు విశిష్ట అతిథిగా రాష్ట్ర మాజీ మంత్రి హరీశ్ రావు, గౌరవ అతిథులుగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఆచార్య శలాక రఘునాథ్ శర్మ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా పాలకవర్గ సభ్యులు జి.వల్లీశ్వర్ హాజరై గ్రంథ సమీక్ష చేస్తారని తెలిపారు. పద్మశ్రీ డాక్టర్ శోభారాజు బృందం అన్నమయ్య కీర్తనలు ప్రదర్శిస్తారని పేర్కొన్నారు.

వేడుకగా నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



గోపూజ నిర్వహిస్తున్న భక్తులు

అత్తాపూర్: హైదర్‌గూడలోని నల్ల పోచమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపత్సవాలు వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ బుధవారం ప్రారంభమయ్యాయి. బాబు జగ్జీవన్‌రామ్ యూత్ అసోసియేషన్ సభ్యులు, ప్రణవ భక్త సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మహోత్సవాలను కనుల పండువగా నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ప్రతిష్ఠాపనోత్సవాలో భాగంగా బుధవారం ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, మాతృకపూజ, గోపూజ, పంచగవ్యప్రసన్యం దీక్షారాధన, అఖండ దీపారాధన, యాగశాల ప్రవేశం అనంతరం అమ్మవారి విగ్రహ ఊరేగింపు నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపులో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భారీ ఏర్పాట్లు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పార్కులో పాగాకు చెక్!

- కోర్టులో కేసు ఉండగానే ఆక్రమణలు
- పోలీసు బందోబస్తు మధ్య తొలగింపు
- మణికొండ మున్సిపల్ అధికారులతో కబ్జాదారుల వాగ్వాదం
- ఓ కాలనీ లేఅవుట్‌తో మరో కాలనీలో కబ్జా
- తొలగింపు సందర్భంగా స్వల్ప ఉద్రిక్తత



ఆక్రమణలను తొలగించిన మున్సిపల్ సిబ్బంది

మణికొండ: ఒక లే అవుట్‌లో పార్కు కొరకు వదలిన భూమిని పక్క లే అవుట్‌లో స్థలాలు కొన్న వారు తమ ప్లాట్లుగా పేర్కొంటూ ఏర్పాటు చేసిన ప్రహరీని మున్సిపాలిటీ అధికారులు తొలగించారు. సదరు పార్కు విషయం ఇప్పటికే రాష్ట్ర హైకోర్టులో వివాదం కొనసాగుతున్నా వాటిని పట్టించుకోకుండా ఏకంగా అందులో 800 గజాల స్థలానికి కొందరు ప్రబుద్ధులు ఎసరు పెట్టారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు వారు ఏర్పాటు చేసిన ప్రహరీని తొలగించి కబ్జా చెర విడిపించారు. వివరాలివీ... మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని తిరుమల హిల్స్ కాలనీ, పుప్పాలగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 87, 119లలో 17.36 ఎకరాల విస్తీర్ణంలో 1990లో అప్పటి హైదరాబాద్ నగరాభివృద్ధి సంస్థ (హుడా) 10132/ఎంపీ2/హుడా/1990 ప్రకారం లేఅవుట్ అనుమతులు జారీ చేసింది. అందులో 8,633 గజాల పార్కుల భూమి అప్పటి గ్రామ పంచాయతీకి రియల్టర్‌లు 1993 సంవత్సరంలో గిఫ్ట్ డీడ్ చేశారు. అక్కడివరకు సజావుగా ఉన్నా... లేఅవుట్ చేయగా మిగిలిన మరి కొంత భూమిలో 2008 సంవత్సరంలో ఆజిల్ బిల్డ్‌కాన్ కాలనీగా మరో లేవుట్ జారీ చేశారు. రెండవ లే అవుట్‌లో అదనపు భూమి చూపటం, అది అప్పటికే తిరుమల హిల్స్ కాలనీ లేఅవుట్‌లో ఉండటంతో కొంత భాగం తొలగించి లేఅవుట్ మంజూరు చేశారు.

పక్క కాలనీ పార్కులో పనులు...

రెండవ సారి మంజూరైన లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు తమ ప్లాట్లు ఇక్కడే వస్తాయని తిరుమలహిల్స్ కాలనీ పార్కు స్థలంలో వారం రోజులుగా ప్రహరీ నిర్మాణ పనులను చేపట్టారు. ఏకంగా 800 గజాల స్థలానికి చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేశారు. సదరు స్థలం విషయంలో ఇప్పటికే రాష్ట్ర హైకోర్టులో కేసు కొనసాగుతోంది. అది పార్కు స్థలమని కాలనీ వాసులు, కాదు తమ ప్లాట్లని కొందరు కోర్టును ఆశ్రయించారు. అందులో మున్సిపాలిటీ అధికారులు ఇంప్లీడ్ అయి పోరాటం చేస్తున్నారు.

☛ ఇదిలా ఉండగా పక్క కాలనీలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు తమ స్థలంగా పనులు చేపట్టడంతో బుధవారం మణికొండ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి సంతోష్‌సింగ్ ఆధ్వర్యంలో నార్సింగి పోలీసుల బందోబస్తు మధ్య సిబ్బంది వాటిని తొలగించారు. ఈ సందర్భంగా టీపీఓ మాట్లాడుతూ... టైటిల్, స్థలం విషయం కోర్టులో ఉందని, అది తేలే వరకు అందులో ఎవరూ ఎలాంటి పనులు చేపట్టరాదన్నారు. రాబోయే రోజుల్లోనూ ఎలాంటి పనులు చేపట్టినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

☛ ప్రహరీ తొలగించే క్రమంలో ప్లాట్ల యజమానులు, టీపీఓకు మధ్య వాగ్వాదం కొనసాగింది. అయినా అవేమీ పట్టించుకోకుండా అక్రమణను తొలగించి మున్సిపాలిటీ స్థలంగా, హైడ్రా ఆధ్వర్యంలో సంరక్షించినట్టుగా బోర్డులు ఏర్పాటు చేశారు.



పార్కు స్థలంగా పేర్కొంటూ ఏర్పాటు చేసిన బోర్డు

పాతబస్తీలో దంచికొట్టిన వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- అరగంటలోనే అతలాకుతలం
- పేలిన ట్రాన్స్‌ఫార్మర్లు..స్తంభించిన విద్యుత్ సరఫరా



ఛత్రినాక ఏఈ పరిధిలో పేలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

చార్మినార్: పాతబస్తీలో బుధవారం మధ్యాహ్నం నుంచి ముసురుతో ప్రారంభమైన వర్షం రాత్రి దంచికొట్టింది. రాత్రి 8:30 నుంచి 10 గంటల వరకు ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పాతబస్తీలోని జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6, సంతోష్ నగర్ సర్కిల్-7లోని పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల ప్రజలు పడరాని పాట్లు పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. విద్యుత్ అధికారులు ఎక్కడెక్కడ చెట్లు కొమ్మలు విరిగిపడ్డాయో.. ఎక్కడ ట్రాన్ఫార్మర్లు పేలిపోయాయి అన్న విషయాన్ని తెలుసుకుంటూ విద్యుత్ మరమ్మతులు చేసి విద్యుత్ పునరుద్ధరించారు. లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లపై వరద నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. చాదర్‌ఘాట్ రైల్వే బ్రిడ్జి కింద వరద నీరు నిలిచిపోవడంతో అటువైపు నుంచి ముందుకు వెళ్లలేని వాహనదారులు పాతబస్తీ దారులను ఆశ్రయించారు. కొన్ని వాహనాలు బ్రిడ్జి కింద నీరులో నిలిచిపోవడం చూసిన వాహనదారులు డబీర్‌పురా, యాకుత్‌పురా తదితర ప్రాంతాల నుంచి సైదాబాద్, చంచల్ గూడా, సంతోష్ నగర్ వైపు వెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో ఈ రోడ్లలో తీవ్ర ట్రాఫిక్ అంతరాయం కలిగింది. సంతోష్ నగర్ సర్కిల్ సెవెన్ పరిధిలోని బండ్లగూడ మండలం కలందర్ నగర్ తదితర ప్రాంతాల్లో 87.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మలక్‌పేట సర్కిల్-6 సైదాబాద్ మండలంలోని ఆస్మాన్‌ఘడ్ లో 82.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే చార్మినార్ మండలంలోని రెయిన్‌బజార్, యాకుత్పురా ఎస్ఆర్టీ కాలనీ తదితర ప్రాంతాల్లో 56.0, డబీర్ పురా బాల్ శెట్టి కేత్ తదితర ప్రాంతాల్లో 54.0 వర్షపాతం నమోదైంది.

విద్యార్థులకు ఆసక్తికరంగా బోధించాలి

అత్తాపూర్: ఆడుతూ పాడుతూ ప్రైమరీ విద్యార్థులకు తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధించాల్సిన అవసరం ఉందని ఎంఈఓ రాజేంద్రనగర్ మండల విద్యాధికారి కేశవత్ శంకర్ రాథోడ్ అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీసేందుకు సమగ్ర శిక్ష ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఇన్ సర్వీసింగ్ రెండవ రోజు అత్తాపూర్‌లో ఉన్న ఎడిఫై వరల్డ్ స్కూల్‌లో జరిగింది. జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఆడుతూ పాడుతూ ఉపాధ్యాయులకు పాఠాలు చెప్పారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను స్వచ్ఛంద సంస్థ పాఠశాల అభివృద్ధిలో భాగం చేసుకోవాల్సిన బాధ్యత గురువులపై ఉందన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల ప్రలోభాలు వారు చెప్పే మాటలను నమ్మవద్దని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులపై వస్తున్న ఆరోపణలను స్థానిక పాఠశాలలో చైర్మన్‌లతో ఎప్పటికి అప్పుడు సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు సవాళ్లుగా తీసుకొని ముందుకు వెళితే వందశాతం ఫలితాలు మనవైపే ఉంటాయని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. గణిత శాస్త్రంలో శిక్షణ ఉపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి, మాతృభాష తెలుగులో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు రోహిణి, ఇంగ్లిష్‌లో శిక్షణ పొందిన ఉపాధ్యాయుడు అనిల్, ఈవీఎస్‌లో శిక్షణ పొందిన మహేశ్వర్ పాల్గొన్నారు.